క్లుప్తంగా

బాబు, పవన్‌లవి అరాచక రాజకీయాలు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత పోతిన మహేష్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో చంద్రబాబు, పవన్‌కల్యాణ్ క్రిమినల్ ఆలోచనలతో అరాచక రాజకీయాలు చేస్తున్నారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత పోతిన మహేష్ అన్నారు. మహేష్ శుక్రవారం తన కార్యాలయం నుంచి మీడియాకు ఒక వీడియోను విడుదల చేశారు. ఆ వీడియోలో ఆయన మాట్లాడుతూ సామాన్య ప్రజల పక్షాన సీఎం జగన్ షేక్ ఆసిఫ్‌ను అసెంబ్లీ అభ్యర్థిగా నిలబడితే చంద్రబాబు పవన్‌కల్యాణ్ కలసి పెట్టుబడిదారుడు, పెత్తందారైన సుజనాచౌదరిని నిలబెట్టారన్నారు. దీనిని బట్టి జగన్‌కు వారికి మధ్య ఉన్న వ్యత్యాసం అర్థమవుతుందన్నారు. పశ్చిమ అభ్యర్థిగా నిలబడిన షేక్ ఆసిఫ్, ఎంపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కేశినేని నాని అఖండ మెజార్టీతో గెలుపొందుతారని చెప్పారు. ప్రధానంగా కేశినేని నాని వరుసగా మూడో సారి గెలిచి హ్యాట్రిక్ సాధిస్తారని, పశ్చిమంలో వైఎస్సార్‌సీపీ మూడో సారి గెలిచి హ్యాట్రిక్ సాధిస్తుందన్నారు.

టీడీపీ, జనసేనలకు గుణపాఠం చెబుతాం

గిరిజన నాయకుడు మైనర్‌బాబు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): టీడీపీ, జనసేన చేతుల్లో పశ్చిమ నియోజకవర్గంలోని గిరిజనులు, దళితుల దగా పడ్డారని గిరిజన నాయకుడు టి.మైనర్‌బాబు శుక్రవారం ఒక ప్రకటనలో ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తెలుగుదేశం పార్టీ తరఫున 46వ డివిజన్‌లో పోటీ చేసిన మైనర్‌బాబు ఆ తర్వాత జనసేన పార్టీలో కీలకంగా వ్యవహరించారు. తాజాగా ఎన్నికల పొత్తులో భాగంగా ఆ రెండు పార్టీలు వ్యవహరిస్తున్న తీరును ఆయన దుయ్యబట్టారు. పశ్చిమం నుంచి ఎంతో మంది గిరిజనులు, దళితులు ప్రజాప్రతినిధులుగా ఎన్నికై ప్రజలకు సేవ చేశారని, ఇప్పుడు దళితులు, గిరిజనులను రాజకీయంగా ఎదగకుండా చేసేందుకు తెలుగుదేశం, జనసేన పార్టీలు ప్రయత్నిస్తున్నాయన్నారు. తాజాగా జరుగుతున్న ఎన్నికలలో గిరిజనులను కేవలం ఓటర్లుగానే చూస్తున్నారని, వారికి ఎక్కడా ప్రాధాన్యతను ఇవ్వడం లేదన్నారు. గిరిజనులు, దళితులు చైతన్యవంతులై ఆ రెండు పార్టీలకు తగిన రీతిలో గుణపాఠం చెప్పేందుకు తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు.

వడదెబ్బ తగలకుండా హోమియో మందుల పంపిణీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులు వడదెబ్బ తగలకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని కేబీఎన్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు అన్నారు. కేబీఎన్ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగాల ఆధ్వర్యంలో పశ్చిమ నియోజకవర్గంలోని ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు వడదెబ్బ తగలకుండా హోమియో మందుల పంపిణీ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణరావు మాట్లాడుతూ రానున్న రోజుల్లో వడగాడ్పులు మరింత పెరిగే అవకాశం ఉందన్నారు. ఎండలో ఎక్కువగా తిరగరాదన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఆఫీసర్లు కల్మాబేగం, డి.పవన్‌కుమార్, ఎన్.సాంబశివరావు, జె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రనాట్య ప్రదర్శన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై చైత్రమాస బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ఆంధ్రనాట్య ప్రదర్శన జరిగింది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై విజయవాడకు చెందిన రాయన శ్రీనివాసరావు శిష్య బృందం ఆంధ్ర నాట్యాన్ని ప్రదర్శించింది. చిన్నారులు నవ్య, శ్రావణి, తిలోత్తమ, లీలలాస్య, హేమ, అపర్ణ, లక్ష్మీ చైత్ర, మీనాక్షి, పియూష, జశ్విత, మధులిక పలు అంశాలపై చక్కటి హావభావాలతో నాట్య ప్రదర్శన ఇచ్చారు. అమ్మవారి పంచహారతుల అనంతరం దర్శనం పూర్తి చేసుకుని ఆరు బయటకు చేరుకున్న భక్తులు వేదికపై ప్రదర్శిస్తున్న ఆంధ్ర నాట్యాన్ని వీక్షించి ముగ్ధులయ్యారు. అనంతరం చిన్నారులకు అమ్మవారి దర్శనం కల్పించగా, ఆలయ ఏఈవో చంద్రశేఖర్ అమ్మవారి ప్రసాదాలను అందజేశారు.

అలరించిన సినీ సంగీత విభావరి

విజయవాడకల్చరల్: స్వరాంజలి సంగీత, సాహిత్య సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో శుక్రవారం నిర్వహించిన స్వరహేల కార్యక్రమం ఆద్యంతం మధురంగా సాగింది. వ్యవస్థాపక సభ్యురాలు వడ్డాది కామేశ్వరి ఆధ్వర్యంలో గాయనీమణులు గోళ్ల విజయశ్రీ గుప్తా, ఆకుల నూకరత్నం, మండవ లక్ష్మీదాస్, సీతంరాజు మాధవి, మల్లాది శిరీష, గొర్తి లలిత, కొత్త రమణి భక్తిగీతాలు, లలిత గీతాలతో పాటు పలు తెలుగు హిందీ చిత్ర గీతాలను ఆలపించారు. కామేశ్వరి మాట్లాడుతూ.. నగరంలో మహిళలే నిర్వాహకులుగా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. వివిధ రంగాల్లోని మహిళలు కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.

పోటెత్తిన పశ్చిమం

- ఆసిఫ్ నామినేషన్‌కు వేలాదిగా తరలివచ్చిన వైఎస్సార్ సీపీ శ్రేణులు
- జానపద కళారూపాలు, తీన్‌మార్ విన్యాసాలతో జోష్



ప్రదర్శనలో ఆసిఫ్‌తో పాటు పాల్గొన్న అయోధ్యరామిరెడ్డి, కేశినేని నాని, రాయన భాగ్యలక్ష్మి, పుణ్యశీల



వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఆసిఫ్ నామినేషన్ సందర్భంగా నిర్వహించిన భారీ ర్యాలీకి హాజరైన ప్రజానీకం



ప్రదర్శనలో గజమాల వేస్తున్న అభిమానులు, చిత్రంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఆసిఫ్‌తో పాటు ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, మేయర్ భాగ్యలక్ష్మి



దర్గాలో షేక్ ఆసిఫ్, కేశినేని నాని ప్రార్థనలు



కార్పొరేటర్ బుల్లా విజయకుమార్ గుర్రంపై సందడి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి షేక్ ఆసిఫ్ నామినేషన్ సందర్భంగా శుక్రవారం నిర్వహించిన ర్యాలీకి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పోటెత్తారు. నామినేషన్ సందర్భంగా నిర్వహించిన భారీ ప్రదర్శన పార్టీ శ్రేణుల్లో మరింత జోష్‌ను పెంచింది. నియోజకవర్గ ప్రజానీకం అబ్బురపడేలా దిగ్విజయంగా ర్యాలీని చేపట్టారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు కార్యకర్తలు, అభిమానుల నడుమ భవానీపురంలోని ఆర్వో కార్యాలయంలో షేక్ ఆసిఫ్ పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా నామినేషన్‌ను దాఖలు చేశారు. తొలుత కెనాల్ రోడ్డు వినాయకుని గుడి, పాతబస్తీలోని చర్చిల్లో పూజలు ప్రార్థనలను నిర్వహించారు. అనంతరం పంజా సెంటర్‌లోని దర్గాలో పార్లమెంటు సభ్యుడు కేశినేని నాని, మేయర్ రాయన భాగ్యలక్ష్మితో కలిసి ప్రార్థనలను నిర్వహించారు. ప్రదర్శన మధ్యలో చిట్టి నగర్ కొత్త అమ్మవారి ఆలయంలో ఆసిఫ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పంజా సెంటర్ నుంచి ప్రత్యేక వాహనంపై బయలుదేరిన షేక్ ఆసిఫ్‌కు నాయకులు, అభిమానులు భారీ గజమాలలు వేసి జయజయధ్వానాలు పలికారు. ఆయా డివిజన్ల కార్పొరేటర్లు ప్రదర్శన తమ ప్రాంతంలోకి రాగానే క్రేన్‌ల సాయంతో దండలు వేసి స్వాగతం పలికారు. పార్టీ కార్యకర్తలు ప్రభంజనంలా రావడంతో పాతబస్తీలోని రహదారులన్నీ కిక్కిరిసిపోయాయి. కార్యకర్తల నినాదాలతో వన్‌టౌన్, విద్యాధరపురం వీధులన్నీ హోరెత్తాయి. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జెండా రంగులతో కూడిన బెలూన్లతో, ఉత్తేజపర్చే పాటలతో సాగిన ప్రదర్శనలో కార్యకర్తలు కదం తొక్కారు.

శుభాకాంక్షలు తెలిపిన సంఘాలు, ప్రముఖులు

నామినేషన్ దాఖలు చేయటానికి బయలుదేరుతున్న షేక్ ఆసిఫ్‌కు పశ్చిమ నియోజకవర్గంతో పాటుగా నగరంలో ఉన్న వివిధ సామాజిక వర్గాల సంఘ నేతలు, ప్రముఖులు, వాణిజ్య సంఘాల నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. నగరాల సంఘ నాయకులు బాయన వెంకట్రావు, బాయన బాబూజీ, ఎన్వీరావు, రాంపిళ్ల జయప్రకాష్‌తో పాటుగా చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు, పాతబస్తీలోని వివిధ అసోసియేషన్లకు చెందిన నాయకులు ముఖ్యంగా ముస్లిం సంఘాల ప్రతినిధులు, అసోసియేషన్ల కార్యవర్గాలు ఆసిఫ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపాయి. ఘనంగా సత్కరించాయి.

ఆకట్టుకున్న కళారూపాలు

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి షేక్ ఆసిఫ్ నామినేషన్ సందర్భంగా నిర్వహించిన జానపద కళారూపాలు ఆకట్టుకున్నాయి. కేరళ వాద్య విన్యాసాలతో కళాకారులు అలరించారు. తీన్‌మార్ వాద్యాలతో కళాకారులు ప్రదర్శన పొడవునా ఆకట్టుకున్నారు. పులివేషాలతో అలరించారు. శ్రీకాకుళం నుంచి వచ్చిన జానపద కళాకారులు తమ ఢంకాలతో ఆకట్టుకున్నారు. వారితో పాటుగా రైతు దంపతుల వేషధారణతో జానపద కళాకారులు నాట్యాలు చేస్తూ ముందుకు సాగారు. వారితో పాటుగా గుర్రాలపై పార్టీ జెండాలను పట్టుకొని పార్టీ శ్రేణులు కదం తొక్కాయి. దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని గుర్రపు బగ్గీలో ఉంచి ఊరేగించారు. 49వ డివిజన్ కార్పొరేటర్ బుల్లా విజయకుమార్ గుర్రంపై కూర్చుని పార్టీ జెండాను చేతబూని ప్రదర్శన పొడవునా సందడి చేశారు.

హారతులు పట్టిన మహిళలు

ప్రదర్శన పొడవునా మహిళలు ఆసిఫ్, ఇతర నాయకులకు హారతులు పట్టి స్వాగతం పలికారు. కేటీరోడ్డులో మహిళలు బోనాలతో స్వాగతం పలికి విజయీభవ అంటూ దీవించారు. సితారా సెంటర్‌లో మహిళలు హారతులు పట్టి కొబ్బరికాయలతో దిష్టి తీశారు. కార్పొరేటర్ చైతన్యరెడ్డి ఆధ్వర్యంలో గుమ్మడికాయలతో దిష్టి తీసి స్వాగతం పలికారు. పలువురు వారి వారి మత సంప్రదాయాలకు అనుగుణంగా ఆయా ప్రముఖులతో ఆశీస్సులందించారు.

వేల కోట్లు ఎగవేసిన వారిని తరిమికొట్టాలి

- బ్యాంకులకు అప్పులు చెల్లించి అభివృద్ధిపై మాట్లాడాలి
- విజయవాడ పార్లమెంట్ సభ్యుడు కేశినేని నాని
- వైఎస్సార్ సీపీ పశ్చిమ అభ్యర్థిగా షేక్ ఆసిఫ్ నామినేషన్
- పశ్చిమంలో మతోన్మాదులకు చోటు లేదు
- సుజనా పిట్టలదొరలా మాట్లాడుతున్నాడు
- వైఎస్సార్ సీపీ అభ్యర్థి షేక్ ఆసిఫ్
- భారీ ర్యాలీలో పాల్గొన్న అయోధ్య రామిరెడ్డి, ఎంపీ నాని, ఎమ్మెల్యే వెలంపల్లి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): బ్యాంకుల్లో ఉన్న ప్రజాధనాన్ని అప్పుగా తీసుకుని వేలాది కోట్లను ఎగవేసిన దొంగలను పశ్చిమ నియోజకవర్గ ప్రజలు తరిమికొడతారని విజయవాడ లోక్‌సభ సభ్యుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కేశినేని నాని అన్నారు. విజయవాడ పశ్చిమ నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా షేక్ ఆసిఫ్ శుక్రవారం పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో తన నామినేషన్‌ను దాఖలు చేశారు. తొలుత పంజా సెంటర్ నుంచి భారీ ర్యాలీగా బయలుదేరారు. పార్టీ రీజినల్ కోఆర్డినేటర్ అయోధ్య రామిరెడ్డి, ఎంపీ అభ్యర్థి కేశినేని నాని, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రుహుల్లా, ఏపీ ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ బండి నాగేంద్ర పుణ్యశీల, వైఎస్సార్ సీపీ నాయకుడు పోతిన మహేష్ తదితరులు వాహనంపై ఆశీనులయ్యారు. పలువురు కార్పొరేటర్లు, కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు వేలాది మంది కార్యకర్తలు ర్యాలీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మీడియాతో కేశినేని నాని మాట్లాడుతూ సుజనా చౌదరి బ్యాంకుల నుంచి తీసుకున్న అప్పులను చెల్లించి ఆ తరువాత విజయవాడ పశ్చిమ నియోజకవర్గంలో పోటీ చేయాలని డిమాండ్ చేశారు. అప్పుడే ప్రజలను ఓట్లు అడగాలని సూచించారు. సుజనాచౌదరిపై మనీలాండరింగ్, ఈడీ కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఆసిఫ్‌కు పశ్చిమ నియోజకవర్గ ప్రజలందరూ బ్రహ్మరథం పట్టారని, నామినేషన్ సందర్భంగా నిర్వహించిన ర్యాలీకి అనూహ్యమైన స్పందన లభించిందన్నారు. ప్రజల అండతో రానున్న ఎన్నికల్లో భారీ మెజార్టీతో ఆసిఫ్ గెలుపొందనున్నారని చెప్పారు.

మతోన్మాదులను తరిమికొడతారు : ఆసిఫ్

వివిధ మతాలు, కులాలు శాంతియుతంగా జీవిస్తూ ఒక మినీ భారతదేశంగా కొనసాగే పశ్చిమ నియోజకవర్గంలో మతోన్మాద శక్తులకు చోటు లేదని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి షేక్ ఆసిఫ్ అన్నారు. అటువంటి శక్తులను తరిమికొట్టడానికి పశ్చిమ నియోజకవర్గ ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. నామినేషన్ దాఖలు చేసిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. సుజనా చౌదరి పిట్టలదొరలా మాట్లాడుతున్నాడని ఎద్దేవా చేశారు. పశ్చిమంలో సుజనా అవసరం ప్రజలకు లేదన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత రూ.450 కోట్ల అభివృద్ధి చేసిందన్నారు. సుమారు 850 కోట్ల రూపాయల మేర సంక్షేమ పథకాలను నియోజకవర్గ ప్రజలకు అందించిందన్నారు. నియోజకవర్గంలో సుమారు 12 డివిజన్లలో కొండలు ఉన్నాయని, వాటి గురించి సుజనాచౌదరికి తెలుసా అని ప్రశ్నించారు. ర్యాలీలో వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు అడపా శేషు, మనోజ్‌కొఠారి, మెహబూబ్, గౌస్‌మొహిద్దీన్, జమలపూర్ణమ్మ, పలువురు కార్పొరేటర్లు, డివిజన్ల ఇన్‌చార్జిలు భారీ సంఖ్యలో కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.



కేరళ వాద్య కళాకారుల సందడి



రైతు దంపతుల వేషధారణలో కళాకారులు



బోనాలతో స్వాగతం పలుకుతున్న మహిళలు



గుమ్మడికాయలతో దిష్టి తీస్తున్న కార్పొరేటర్ చైతన్యరెడ్డి ఇతర మహిళలు

పవిత్ర సారె, ప్రసాదాల కౌంటర్లు తనిఖీ

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలోని పవిత్ర సారె, ప్రసాదం కౌంటర్లను ఈవో కేఎస్ రామరావు శుక్రవారం తనిఖీ చేశారు. ఘాట్‌రోడ్డులోని ఓం టర్నింగ్‌లోని పవిత్ర సారె కౌంటర్‌కు చేరుకున్న ఈవో కౌంటర్‌లోని కొబ్బరి కాయలు, పూజా సామగ్రి, చీరల రికార్డును పరిశీలించారు. పవిత్ర సారె సామగ్రి రోజుకు ఎంత మేర అమ్ముడవుతుందనే వివరాలను అడిగి తెలుసుకోవడమే కాకుండా రికార్డులలోని వివరాలతో సరిచూశారు. ఇక మహా మండపం లిఫ్టు ద్వారా కొండపైకి చేరుస్తున్న లడ్డూ రికార్డును ఈవో తనిఖీ చేశారు. లడ్డూ స్టాక్ ఏ కౌంటర్‌కు చేరుస్తున్నారు..కౌంటర్ రికార్డులను పరిశీలించారు. కౌంటర్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈవో వెంట ఏఈవో ఎస్.రమేష్‌బాబు ఉన్నారు.



ప్రసాదాలను తనిఖీ చేస్తున్న ఈవో రామరావు

మహా మండపం క్యూలైన్ల పరిశీలన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): మహా మండపంలోని క్యూలైన్ కాంప్లెక్స్‌లో దుర్గగుడి ఈవో కేఎస్ రామరావు శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. క్యూలైన్‌లోని టాయిలెట్స్, మంచినీటి వసతులను పరిశీలించిన ఈవో దేవస్థాన ఇంజినీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. మంచినీటి కుళాయిల వద్ద అపరిశుభ్ర వాతావరణం ఉండటంతో శానిటేషన్ విభాగం పర్యవేక్షకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. టాయిలెట్స్‌లో సరైన నీటి సదుపాయం లేకపోవడంపై, తలుపులు విరిగిపోయి ఉండటంతో భక్తుల ఇబ్బందులకు గమనించాలని సూచించారు. మెట్ల మార్గాన్ని శుభ్రం చేయడంతో పాటు భక్తులకు మంచి నీటి సదుపాయాన్ని మెరుగు పరచాలని ఆదేశించారు.

టీడీపీ అభ్యర్థి గద్దెపై తొమ్మిది క్రిమినల్ కేసులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): విజయవాడ తూర్పు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గద్దె రామ్మోహన్‌పై తొమ్మిది క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. అందులో కృష్ణలంక పోలీస్‌స్టేషన్‌లో మూడు, పటమట పోలీస్‌స్టేషన్లో మూడు, సూర్యారావుపేట స్టేషన్‌లో ఒకటి, తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో రెండు కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇవన్నీ నిబంధనలకు విరుద్ధంగా, ప్రజలకు అసౌకర్యం కలిగించేలా చట్ట ఉల్లంఘనకు పాల్పడినందుకు గాను ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో ఆయా కేసులు నమోదయ్యాయి. అందులో మూకుమ్మడిగా దాడి చేసిన కేసులతో పాటు, అసెంబ్లీలో చట్ట వ్యతిరేకంగా ప్రవర్తించడం, ఆస్తుల ధ్వంసం, అక్రమ ప్రవేశం, అనుమతి లేకుండా ధర్నా చేయడం, ప్రజలు ఇబ్బంది పడేలా వ్యవహరించడం వంటి అంశాల్లో కేసులు నమోదయ్యాయి. అలాగే తన పేరిట రూ.3,97,48,000, తన భార్య పేరిట రూ.9,57,65,500 ఆస్తులు ఉన్నట్లు అఫిడవిట్‌లో పేర్కొన్నారు.

పిల్లలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తాం

న్యాయమూర్తి రామకృష్ణయ్య

భవానీపురం(విజయవాడపశ్చిమ): అవసరమైన పిల్లలకు ఉచిత న్యాయ సేవలు అందిస్తామని కృష్ణాజిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, న్యాయమూర్తి కేవీ రామకృష్ణయ్య తెలిపారు. విద్యాధరపురం కబేళా రోడ్‌లోని ప్రభుత్వ బాలుర పరిశీలనా గృహం (జువెనైల్ హోమ్)ను ఆయన శుక్రవారం సందర్శించి రికార్డులను పరిశీలించారు. పిల్లలతో సంభాషించి వారికి హోమ్‌లో కల్పించే సౌకర్యాలు, సమస్యలు, వారికి కల్పించే లీగల్ సర్వీసెస్ (న్యాయ సలహాలు) గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పిల్లలకు వివిధ చట్టాలపై క్లుప్తంగా వివరిస్తూ అవగాహన కల్పించారు. బాల్యంలో తెలిసో తెలియకో చేసిన తప్పుల పట్ల పశ్చాత్తాప పడి పరివర్తన చెందాలని అన్నారు. తద్వారా సమాజంలో ఉత్తమ పౌరులుగా తయారవ్వాలని సూచించారు. కార్యక్రమంలో హోమ్ పర్యవేక్షణాధికారి పి.రామమోహన్‌రెడ్డి, బాలల న్యాయ సలహా మండలి సభ్యులు అన్నామణి, ప్యానల్ లాయర్ మహాలక్ష్మి, ప్రొహిబేషన్ ఆఫీసర్ హసన్ అలీ బేగ్ తదితరులు పాల్గొన్నారు.



హోమ్‌లోని పిల్లలతో మాట్లాడుతున్న జడ్జి రామకృష్ణయ్య

కాలేయ వ్యాధిపై అవగాహన అవసరం

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): కాలేయ సంబంధిత వ్యాధులు, వాటి నివారణ, చికిత్సపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రముఖ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ ఎస్.భవనారాయణ సూచించారు. ప్రపంచ కాలేయ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం రైల్వే హాస్పిటల్ న్యూ ఓపీడీ భవనంలో కాలేయ వ్యాధి స్క్రీనింగ్ పరీక్షలు, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ భవనారాయణ మాట్లాడుతూ అవగాహన లోపంతో చాలామంది కాలేయ వ్యాధి బారిన పడుతున్నారని అన్నారు. మానవ శరీరంలో కాలేయం ముఖ్యమైన అవయవం అని, క్రమం తప్పకుండా వ్యాయామం, పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా కాలేయ సంబంధిత రుగ్మతల నుంచి దూరంగా ఉండవచ్చన్నారు. అనంతరం నాగార్జున హాస్పిటల్, జైడూస్ లైఫ్ సైన్సెస్ సహకారంతో రైల్వే ఉద్యోగులు, లబ్ధిదారులకు ఉచితంగా హెపటైటిస్ బి, హెపటైటిస్ సి, ఫైబ్రోస్కాన్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో రైల్వే హాస్పిటల్ ఏసీఎంఎస్ డాక్టర్ ఎం.జైదీప్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



రైల్వే హాస్పిటల్‌లో కాలేయ పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కార్మికుల స్వేదానికి ఖరీదు కట్టే షరాబెవ్వరు?

గనిలో...వనిలో...కార్ఖానాలో...విరామమెరుగక పరిశ్రమించే...బలం ధరిత్రికి బలిగావించే కార్మిక వీరుల ఘర్మజలానికి ఖరీదు కట్టే షరాబు లేడోయ్... అన్నాడు మహాకవి శ్రీశ్రీ. రెక్కాడితే కాని డొక్కాడని శ్రామికులు ఎంత ఎండైనా, వడగాడ్పులైనా..ఉక్కపోతయినా...వారికి లెక్కాజమా కాదు...ఎంత పని ఉంటే వారికి అంత ఆనందం. పనే దైవం.. రెక్కలు ముక్కలు చేసుకుని కష్టపడి పనిచేసి నాలుగు రూకలు ఇంటికి తీసుకువెళ్లి ఇంటిల్లిపాది కడుపు నిండా తినగలిగితే చాలు వారికి అంతకంటే ఇంకా ఏమీ అవసరం లేదు. మండు వేసవిలో మిట్టమధ్యాహ్నం ఆటోనగర్‌లో కార్మికులపై 'సాక్షి' ఫోకస్.

ఆటోనగర్(విజయవాడతూర్పు): ఒక పక్క విపరీతమైన ఎండ... మరో పక్క ఉక్కపోత... తల నుంచి అరికాలు వరకు కారిపోతున్న చెమటను సైతం లెక్క చేయకుండా జవహర్ ఆటోనగర్‌లో పనిచేసే కార్మికులు పనులు చేస్తున్నారు. గత రెండు రోజుల నుంచి గరిష్ఠ ఉష్ణోగ్రతలు 40 నుంచి 43 వరకు ఉన్నప్పటికీ కార్మికులు యథాతథంగా తమ పనులు తాము చేసుకుపోతూనే ఉన్నారు. చేతినిండా పని ఉండటంతో ఎంత ఎండైనా, ఉక్కపోత ఉన్నా హుషారుగా శ్రమిస్తున్నారు. ఆటోనగర్‌లో గత కొన్ని రోజుల నుంచి పనులు బాగా ఉండటంతో విజయవాడ చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన వారు నిత్యం ఇక్కడకు పదుల సంఖ్యలో వస్తున్నారు. మెకానిక్, వెల్డింగ్, లారీ బాడీబిల్డింగ్‌తో పాటు అల్యూమినియం షెడ్లన్నీ కార్మికులతో కిక్కిరిసిపోతున్నాయి. అంతే కాకుండా ఆటోమొబైల్ షాపులతో పాటు పలు కంపెనీలకు చెందిన రామెటీరియల్ షాపులు కొనుగోలు దారులతో కిటకిటలాడుతున్నాయి. ఇనుము పనిచేసేవారు ఆరుబయట ఎండలోనే శ్రమిస్తున్నారు. పెద్ద పెద్ద గొడుగుల కింద పనిచేస్తున్నారు. పలువురు కార్మికులను సాక్షి పలకరించగా... ఎంత ఎండయినా లెక్క చేయకుండా పనిచేయడం తమకు అలవాటేనన్నారు. ఎండాకాలంలోనే తమకు అధికంగా పనులు దొరుకుతాయని ఆనందంగా చెప్పారు.



గొడుగు కింద పనిచేస్తున్న వెల్డింగ్ కార్మికులు



టైర్ల షెడ్డులో పనిచేస్తున్న కార్మికులు



వెల్డింగ్ పనిలో నిమగ్నమైన కార్మికులు



సామానులను అన్‌లోడ్ చేస్తున్న కార్మికులు

తూర్పులో మూడు నామినేషన్‌లు

లబ్బీపేట(విజయవాడ తూర్పు): విజయవాడ తూర్పు నియోజకవర్గం నుంచి శుక్రవారం రెండో రోజు మూడు నామినేషన్‌లు దాఖలయ్యాయి. టీడీపీ నుంచి గద్దె రామ్మోహన్, గద్దె అనురాధ, గద్దె క్రాంతికుమార్‌ల తరఫున ఒక్కో సెట్ నామినేషన్లను వారి అనుయాయులు దాఖలు చేశారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థి దేవినేని అవినాష్ ఈ నెల 24వ తేదీన నామినేషన్ సమర్పించనున్నారు.